

# మృగతృష్ణ

-కె. మురళీకృష్ణ

జీవితాన్ని గురించి అందరికీ ఆశలుంటాయి. బాధితులైన వాళ్ళకు మరింత ఎక్కువ ఆశలుంటాయి. అయితే, ఆశలు పెట్టుకున్న వాళ్ళంతా జీవితంలో సుఖాలను చవిచూడలేరు. ఆ సుఖాలను సాధించగలిగి వుండీ ఎందుకని అలా అసమర్థులలాగా వుండిపోతారు?

తమ సుఖాలను మాత్రమే చూసుకోగలిగిన వాళ్ళు ఏ అవకాశం దొరికినా అందుకుని సుఖపడతారు. తనతో పాటు తన వాళ్ళు కూడా సుఖపడాలని కోరుకునే వాళ్ళు వచ్చిన అవకాశాలను కూడా స్వచ్ఛందంగానే వదులుకుంటారు. చాలా సందర్భాల్లో అటువంటి వారికి మిగిలేది మృగతృష్ణ లాంటి జీవితమే!

రామశర్మతో నాకు చాలా గమ్మత్తుగా పరిచయమైంది. నేను డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాను. నా గ్రూపు జి.జి.సి. అంటే జియాలజి, జాగ్రఫీ, కెమిస్ట్రీ. రామశర్మ గ్రూపు ఎం.పి.జి. అంటే మాథ్స్, ఫిజిక్స్, జియాలజి ఈ రెండు సెక్షన్లూ ఒక్క జియాలజీ క్లాసులోనే కలుస్తాయి. కాబట్టి ఆ క్లాసులోనే వొకరికొకరం ఎదురు పడటం తటస్థించేది.

నాకు బిడియం ఎక్కువ. నా అంతట నేను ఎవ్వరినీ పలుకరించే వాడిని కాదు. ఎవరయినా నన్ను పలుకరించినా నాకు అర్థం కావటానికి కొంచెం సమయం అయ్యేది. అందుకని ఎవరూ నన్నంతగా పట్టించుకునేవారు కారు. నా స్వభావానికి రామశర్మ పూర్తిగా వ్యతిరేకం. అతను క్లాసులో అడుగు పెడుతూంటేనే తుఫానొచ్చి నట్లుండేది. ఒక్క నన్ను తప్ప దాదాపుగా అందరినీ పలకరించేవాడు, ఏడ్పించేవాడు. కాలేజీ మొదలయి కనీసం నెలయినా కాకముందే దాదాపుగా కాలేజీలో రామశర్మ తెలియనివారు లేరు. ఎప్పుడూ పెద్ద మిత్ర బృందం వెంట వుండేది. వొంటరిగా వుండటం తక్కువే.

అటువంటి రామశర్మ ఇవాళ్ళ లక్డీకాపూల్ బస్ స్టాప్ దగ్గర వొంటరిగా కనిపించటం ఆశ్చర్యమనిపించింది. పలకరిద్దామనుకున్నాను. కానీ నా కాళ్ళు కదలలేదు. ఇంతలో రామశర్మే నా వైపు చూశాడు. పలకరింపుగా నవ్వాడు. తత్తరబిత్తర పడ్డాను. అయినా తిరిగి నవ్వగలిగాను. అతనే నా దగ్గరకు వచ్చాడు.

''మీరు మా కాలేజీ కదా?'' అడిగాడు.

''అవును జి.జి.సి. ఫస్టియర్'' చెప్పాను.

''అరే-నేను ఎం.పి.జి. బహుశా జియాలజీ క్లాసులో చూసి వుంటాను'' అన్నాడు.

''అవును.''

''నా పేరు రామశర్మ''

''తెలుసు. నా పేరు శరత్ కృష్ణ''

''మీ పేరు బావుంది. నేను కృష్ణా అని పిలుస్తాను'' అన్నాడు.

పేరు బావుందన్నందుకు సిగ్గు పడ్డాను. అది చూసి నవ్వాడు.

''మీకు బహుశా సిగ్గెక్కువ క్కాబోలు!''

''అదేం కాదు. స్టార్టింగ్ ట్రబుల్'' అన్నాను.

రామశర్మ పెద్దగా నవ్వేడు.

''నాకు స్టాపింగ్ ట్రబుల్'' అన్నాడు.

ఇద్దరం నవ్వేశాం.

''ఎటు వెళ్తున్నారు? క్లాసెగ్గొట్టినట్టున్నారు?'' అన్నాడు.

నేను క్లాసెగ్గొట్టానని తెలిసినందుకు సిగ్గు పడుతూ ఏం చెప్పలేదు.

''పర్లేదు. నేనూ క్లాసెగ్గొట్టాను. ఆ సంస్కృతం లెక్చరర్ వీరబోరు. మొదటి రోజే

నన్ను భయపెట్టేశాడు'' అన్నాడు.

''నేను ఇంగ్లీష్ క్లాసెగ్గొట్టాను'' నెమ్మదిగా చెప్పాను.

''అదేం ఇంగ్లీష్ మేడం చాలా అందంగా వుంటుంది కదా?''

''మాకు మేడం రాదు. శాంతయ్య'' చెప్పాను.

''అయితే చాలా తెలివయిన పనిచేశారు.''

రామశర్మ పొగిడినందుకు పొంగిపోయాను.

''ఇంటికేనా?'' అడిగాడు.

కాదన్నట్టుగా తలవూపాను.

''ఏ సినిమా?''

''నేను వెళ్ళే సినిమా మీకు నచ్చక పోవచ్చు.''

''ఏమిటది?''

''చాలా పాతది. బైజు బావరా''

''భలేవారే. నేను క్లాసెగ్గొట్టిందీ ఆ సినిమా కోసమే. ఇద్దరం కలిసి చూద్దాం'' అన్నాడు.

నేను ఇబ్బందిగా మొహం పెట్టాను. చెప్పాలా? వద్దా? అనుకున్నాను. చెప్పకపోతే తర్వాత నాకే నష్టం.

''నేను సినిమాలు లోయెస్ట్ క్లాసులోనే చూస్తాను'' అన్నాను.

''నేను రూ.1-50కే వెళ్తాను. ఎందుకంటే దానికంటే తక్కువ లేదు కాబట్టి'' అన్నాడు రామశర్మ నవ్వుతూ.

ఆ క్షణమే అనుకుంటాను మా ఇద్దరి మధ్యా గాఢ స్నేహానికి పునాది పడ్డది.

సినిమా ఇద్దరికీ అద్భుతంగా అనిపించింది.

''అసలు ప్రేమంటే అది. అమరప్రేమ. ఆ పాటలు, ఆ కథ, డైరెక్షన్, డైలాగులు, ప్రతి సీను, ప్రతిక్షణం మనస్సుకు హత్తుకునేట్టుగా తీశారు. హీరో హీరోయిన్ వైపు చూసిన చూపుల్లో వొక్కసారి కూడా వెకిలితనం కనపడదు. పోనీ పాటలలో నయినా ఆ భావన రాదు. అదే ఇప్పటి సినిమాల్లో అయితే పవిత్ర ప్రేమ అంటారు. పాడేది పరమ బూతు పాట. అంటే అదే పవిత్రమయిన ప్రేమన్నమాట'' అన్నాడు శర్మ హాలునుండి అవతలకొస్తుంటే.

ఏకీభవించకుండా వుండలేక పోయాను. నేనూ ప్రేమ సినిమాలు చూశాను కానీ నా మనస్సెప్పుడూ ఇంత విషాదానికి లోను కాలేదు.

''నాకింకోసారి చూడాలని వుంది'' అన్నాడు శర్మ ఆగి.

''నాక్కూడా'' అన్నాన్నేను.

''ఫస్టు షో కూడా చూద్దామా?''

ఒక్క క్షణం ఆలోచించాను. నాకూ ఇంకోసారి చూడాలని వుంది. ఎలాగో ఆలస్యమయినందుకు ఇంట్లో ఏదో కారణం చెప్పక తప్పదు. ''అలాగే'' అన్నాను.

ఇద్దరం వో 'టీ' తాగి మళ్ళీ క్యూలో నుంచున్నాం. మా సంభాషణ తిరిగి సినిమాలు, ప్రేమల వైపు మళ్ళింది.

ఇంతలో బుకింగ్ కౌంటర్ తెరిచారు. నేను జేబులోంచి డబ్బులు తీశాను. సరిగ్గా రు. 1-50 వుంది.శర్మ వెనుక నుంచి నా భుజం తట్టాడు.

''నేను డబ్బులు సరిగ్గా చూసుకోలేదు. నా దగ్గర పది పైసలు తక్కువున్నాయి'' అన్నాడు.

ఇద్దరం తీవ్రంగా మా దగ్గర వెతికాం. ఎవరి దగ్గరా ఇంకో పైస లేదు.

''పోనీ ఆ బుకింగ్ వాడికి చెబ్దాం. పది పైసలే తక్కువ కదా! టిక్కెట్టిస్తాడు'' అన్నాడు శర్మ.

నేనొప్పుకోలేదు. ''పోనీ ఇంకో రోజు చూద్దాం. మన దగ్గర వున్నప్పుడు చూద్దాం. లేకపోతే లేదను. అయినా ఒకసారి చూసేశాం కదా!'' అన్నా~

శర్మ నా వైపు నిశితంగా చూశాడు. ''సరే'' అన్నాడు. ఇద్దరం బయటకొచ్చాం.

ఆబిడ్స్ సందడిగా వుంది. దుకాణాల్లో దీపాలు వెలిగించారు. ఆ దీపాల ధగధగతో దుకాణాలు, రోడ్డు వెలిగి పోతున్నాయి.

''చూశావా! ఇక్కడింత డబ్బు. మన దగ్గర పది పైసలు తక్కువయినాయి'' అన్నాడు శర్మ.

''ట్యాంక్ బండ్ వెళ్దాం'' అన్నాన్నేను.

ఇద్దరం ట్యాంక్ బండ్ వైపు నడవడం మొదలు పెట్టాం. దారిలో ఏమీ మాట్లాడుకోలేదు. ఆ దుకాణాలనూ, కనిపించే మనుషులనూ, కార్లనూ, బస్సులనూ చూస్తూ నడుస్తున్నాము. మా ఇద్దరికీ ఆ నడక మమ్మల్ని ఎంతో దగ్గర చేసినట్టు అనిపించింది. దారిలో మమ్మల్ని దాటి వెళ్తున్న కార్లను అవి కనుమరుగయే దాక చూశాడు రామశర్మ.

''కృష్ణా మన దగ్గర డబ్బు లేకపోవటం వల్ల మనం ఎంతో కోల్పోతున్నామని నీకెప్పుడూ అనిపించలేదా?'' అడిగాడు శర్మ టాంక్ బండ్‌లో ఓ బెంచిపై కూర్చుంటూ.

నేనేమీ అనలేదు.

''నాకు చాలా బాధనిపిస్తుంది. డబ్బున్నవాడిదే రాజ్యం. వాడికే సౌఖ్యాలు, రాజభోగాలు. వాడెంత నీచుడు కానీ, తెలివి తక్కువవాడు కానీ అందరూ గొప్పవాడని గౌరవిస్తారు. ప్రతి చోటా ప్రివిలైజ్డ్ ట్రీట్‌మెంట్. వాడేం కోరుకుంటే అది దొరుకుతుంది. అదే మనకైతే, మన బతుకులు వేష్టు. ఎందుకూ పనికి రావు. ప్రపంచంలో అత్యద్భుతమైనవీ, అందమైనవీ అన్నీ డబ్బున్నవారికే. డబ్బున్నవాడు తాజ్‌మహల్ కట్టిస్తే అదో గొప్ప! ప్రేమకు నిదర్శనం. ఆ అరువు ప్రేమ చిహ్నాన్ని చూసి మనం వుబ్బిపోతాం. మన మనస్సుల్లో తాజ్‌మహళ్ళను మించిన అందమైన ప్రేమ వున్నా ఎవరూ పట్టించుకోరు. ఎందుకంటే డబ్బు లేదు కాబట్టి''

నేనేమీ అనలేక పోయాను. నిజమేనన్నట్టుగా తలాడించాను.

''నాకు బోలెడంత డబ్బు సంపాదించాలని వుంది. ఈ డబ్బు వల్ల వొచ్చే సౌఖ్యాలన్నీ అనుభవించాలి. డబ్బే వుంటే బస్సు కోసం ఎదురు చూపులుండవు. కార్లో వెళ్ళవచ్చు. ఈ వెధవ కాలేజీలో చదవం. ఏ బిట్జ్ పిలానీయో, లేక విదేశాల్లోనో చదువుతాం. సినిమా క్యూల్లో నుంచోము. ఫోన్లో రిజర్వేషన్. పల్లీలు కొంటామా? ఛీ ఛీ హాయిగా ఏ ఖరీదయిన హోటల్లోనో ఓ అందమయిన అమ్మాయి వడ్డిస్తూంటే ఇంకో అందమైన అమ్మాయి ఎదురుగా వుంటే టిఫిన్ చేస్తాం'' అన్నాడు శర్మ.

నాకు నవ్వొచ్చింది. నవ్వేశాను.

నేనెప్పుడూ ఈ రకంగా ఆలోచించలేదు. డబ్బు లేకపోవటం వల్ల నేనేదో కోల్పోతున్నానని నాకెప్పుడూ అన్పించలేదు. నాకెప్పుడూ ఖర్చులను నా దగ్గిర వున్నంతలోనే వేయడం అలవాటు.

ఆ రోజిద్దరం చీకటి పడేదాకా మాట్లాడుకున్నాం. ఒకే రోజులో ఎంతో సన్నిహితులమయ్యాము. శర్మ చిన్నప్పుడే వాళ్ళ నాన్నగారు పోయారట. వాళ్ళమ్మ పెద్దగా చదవలేదు. నాన్నగారి ఆఫీసులోనే ప్యూన్ ఉద్యోగం ఇచ్చారట.

రామశర్మ ఇంటికి పెద్ద. అతనికిద్దరు తమ్ముళ్ళు, ఇద్దరు చెల్లెళ్ళు. తమ్ముడిప్పుడు పదవ తరగతి.మిగిలిన వాళ్ళింకా చిన్న పిల్లలు. ఇల్లు కష్టంగా గడుస్తుంది.

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

రాత్రి తొమ్మిదయింది. తిరిగి ఇంటి కెళ్ళ టానికి బస్సులు దొరకవని బయలుదేరాం. ఇద్దరికీ ఇళ్ళ కెళ్ళాలని లేదు. కానీ తప్పదుగా!

''ఇదే నాకు కారుంటేనా నిన్ను ఇంటి దాకా దింపేవాడిని'' అన్నాడు శర్మ. దివరికి తరువాత రోజు కాలేజీలో ఓ గంట ముందు కలిసేట్టుగా నిర్ణయించుకుని బయలుదేరాం.

మా ఇద్దరిదీ విడదీయరాని స్నేహమయి పోయింది. క్లాసులో మిగిలిన వారిని పట్టించుకునే వాళ్ళం కాదు. క్లాసులు కూడా సరిగా అటెండ్ చేసే వాళ్ళం కాదు. కాలేజీలో కలవటం మార్నింగ్ షో, మాట్నీషో చూడడం, పల్లీలు కొనుక్కోటం, డబుల్ డెక్కర్ బస్సులో పైన మొదటి సీటులో కూర్చుని తీవ్రంగా చర్చించు కోవటం మా దినచర్య. ప్రపంచంలోని ప్రతి విషయం గురించి చర్చించే వాళ్ళం. మా సాయంత్రాలు ఓ రోజు టాంక్ బండ్‌లో, ఇంకో రోజు బిర్లా మందిర్ పైన, మరో రోజు డబల్ డెక్కర్ బస్సులో గడిచేవి. శర్మకు దేవుడంటే నమ్మకం లేదు. బిర్లా మందిర్ కెందుకొచ్చావని అడిగితే 'కొబ్బరి ముక్కల కోసం' అనేవాడు.

మా ఇద్దరికీ పుస్తకాల పిచ్చి వుంది. ప్రతి ఆదివారం చిక్కడపల్లి దగ్గరున్న సిటీ సెంట్రల్ లైబ్రరీలో ప్రొద్దున్నే కలుసుకుని సాయంత్రం అయిదు దాకా నవలలు చదివేవాళ్ళం. ఆ తరువాత చదివిన విషయాల గురించి చర్చిస్తూ, సినిమా క్యూలో నిలబడే వాళ్ళం. కాలేజీలో అందరూ మమ్మల్ని 'పర్‌ఫెక్ట్‌కపుల్' అని ఏడ్పించే వాళ్ళు. మేము పట్టించుకుంటే కదా!

డిగ్రీ పూర్తయిన తరువాత కూడా మా స్నేహం అలాగే కొనసాగింది. నేను ఎమ్మెస్సీలో చేరాను. శర్మ వుద్యోగాల వేటలో పడ్డాడు.

ఓ రోజు ఎంతో వుత్సాహంగా ఇంటి కొచ్చాడు. ఏదో కంపెనీలో 'అకౌంటెంట్'గా చేరినట్టు చెప్పాడు.

''అదేమిటి నువ్వు సైన్సు స్టూడెంట్ కదా!'' అన్నాను.

''అవును. చదువుకీ వుద్యోగానికీ ఏమిటి సంబంధం?

ఇంకో మూడు నెలల్లో నేను 'మెడికల్ రిప్రజెంటేటివ్'గా జేర్తున్నాను'' అన్నాడు.

ఆ రోజు మేమిద్దరం సినిమాకెళ్ళాం. ''ఇప్పుడు నేను వుద్యోగస్తుడిని'' అని శర్మే టిక్కెట్లు తీశాడు.

దాదాపుగా అయిదారు నెలలు ఇద్దరం కలుసు కోలేదు. ఓ రోజు సాయంత్రం ఇంటి ముందు 'లూనా' వొచ్చి ఆగింది. ''ఎవరొచ్చారా?'' అని చూస్తే శర్మ.

''నాదే,కొన్నాను'' గర్వంగా చెప్పాడు.

మెడికల్ రిప్రజెంటేటివ్‌గా చేస్తున్నాడట. సిటీలో పని చెయ్యటానికి అనువుగా వుంటుందని ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో కొన్నాడట.

''ఇక చూడు కృష్ణా. నేను నెలకు వెయ్యి రూపాయిల దాకా దాస్తాను. ఈ సంవత్సరం కష్టపడతా. వొచ్చే సంవత్సరం నుంచీ ఎన్జాయ్'' అన్నాడు సంతోషంగా.

మళ్ళా మూడు నాలుగు నెలల దాకా పత్తా లేదు. నేనూ నా చదువు గొడవల్లో పడ్డాను.

హఠాత్తుగా ఓ రోజు వొచ్చాడు. నన్ను 'అస్రాని' హోటల్‌కు లాక్కెళ్ళాడు. ఓ మంచి కంపెనీలో ఆఫరొచ్చిందట. బొంబే వెళ్తున్నాడట. బిల్లు చూసి నా కళ్ళు తిరిగి పోయాయి. అయిదు రూపాయిలు టిప్పిస్తాడు, నేను పడిపోయే వాడినే.

''ఇదే నేను ఫ్రీగా ఖర్చు పెట్టింది. రేపు బొంబే వెళ్తున్నాను. అక్కడ అలవెన్సులు నేను ఖర్చు పెట్టుకుని, బేసిక్ ఇంటికి పంపుతాను. ఇంకో ఆరు నెలల్లో చూడు. నేనెలా ఎన్జాయ్ చేస్తానో!'' అన్నాడు.

ఇద్దరం 'సంగీత్'లో 'మిరాకిల్స్ డూ హాపెన్' అనే సినిమా కెళ్ళాం. క్లాసుకు.

నా ఎమ్మెస్సీ పూర్తయింది. కాంపిటేటివ్ ఎగ్జామ్స్ వ్రాయడం, రీసెర్చ్ ఏ ప్రొఫెసరిస్తాడా? అని ఆలోచించడంతోనే నా సమయం గడచి పోతోంది.

శర్మ నుంచి వుత్తరాలు రెగ్యులర్‌గా అందుతూనే వున్నాయి. శర్మ ప్రస్తుతం ఏరియా సేల్స్ మానేజర్‌ట. ఈసారొచ్చినప్పుడు మాట తీరు కాస్త మారింది.

''ఎక్కడి దాకా వొచ్చింది నీ ఎన్జాయ్ మెంట్'' అడిగాను.

''ఇంకో రెండు, మూడు నెలలే. తమ్ముడు రైల్వే పరీక్ష పాసయ్యేడు. తెలిసిన వాళ్ళిప్పిస్తామన్నారు. డబ్బివ్వాలి.
నేను దాచుకున్నది ఇచ్చాను. అమ్మ ఆరోగ్యం బాగాలేదు. డాక్టర్లకు కొంచెం ఖర్చయింది. అయినా నో ప్రాబ్లం. ఇవన్నీ మైనరే. నీ వుద్యోగ ప్రయత్నాలు ఎలా వున్నాయి?'' అని నన్నడిగాడు.

''ఏమిటో ఈ కాంపిటేటివ్ పరీక్షలు అంతు పట్టడంలేదు. ఈ దేశంలోని హైయస్ట్ చదువు ఎమ్మెస్సీ. అది చదివాను. అయినా ఇప్పుడు ఈ అక్బరే కాలం నాటివాడు? అదెవరు కట్టించారు? ఇదెవరు గెలిచారు? ఏ గీత ఎటు వొంగుతుంది? ఈ బొమ్మ తరువాత ఏ బొమ్మ వస్తుంది? ఇవన్నీ ఎందుకు? ఇన్ని రోజులు చదివింది వ్యర్థం. ఇన్నేళ్ళు చదివి ఏం సాధించానో అర్థం కావడం లేదు. చిన్నప్పుడనే వాళ్ళు బాగా చదివి ఫస్టులో పాసయితే ఆఫీసరవు తావురా అని. ఆటలాడనిచ్చేవారు కాదు. కనీసం ఆ ఆటలయినా ఆడివుంటే ఏ స్పోర్ట్స్ మన్ కోటా అయినా వుండేది'' నిస్పృహగా అన్నాను.

''డోన్ట్‌యూ వరీ మై బోయ్. నీకు తెలివి వుంది. వోపిక పట్టు'' అన్నాడు శర్మ.

మళ్లా కొన్ని నెలలు కనపడలేదు. నేను అదృష్టం బావుండి బ్యాంక్ పరీక్షలో పాసయ్యాను. క్లర్క్ వుద్యోగంలో జాయినయ్యాను. పోస్టింగ్ నిర్మల్‌లో వొచ్చింది: నేను వెళ్లే రోజే శర్మ అనుకోకుండా వొచ్చాడు.

మాటల్లో ''శర్మా నీ డబ్బుతృష్ణ తీరిందా?'' అనడిగాను. నా వైపు చూసి నెమ్మదిగా చెప్పాడు.

---

యాంత్రిక జీవన సంరంభంలో తలమునకలైన రచయితలకు ఓపిగ్గా జీవితాన్ని పరిశీలించడానికిగానీ, ఆలోచించడానికిగానీ వెసులుబాటు లేకపోయింది. అందువల్ల నాగరిక (నగరానికి సంబంధించిన) సమాజానికి చెందిన కథల్లో వైవిధ్యం తగ్గి పోయింది. కథారచన ఒక సామాజిక ప్రయోజనానికన్న భావన నీరసపడి, ఎంతో కొంత ఆర్థిక లబ్ధికేనన్న ఉద్దేశ్యం బలీయం కావడంతో ఇమిటేషన్ కథల ప్రాబల్యం హెచ్చింది. కథలు జీవితంలో నుంచి రావడం మానేశాయి., పైగా జీవితానికి దూరమై పోసాగాయి.

-మధురాంతకం రాజారాం.

సేకరణ: తవుటు నాగభూషణం

''లేదు. అసలు సంపాదన ఇప్పుడే మొదలు. ప్రస్తుతం సంపాదించింది అంతా ఇంట్లోవాళ్ల కొరకు. తమ్ముడు రైల్వేలో ట్రైనింగవుతున్నాడు. ఇంకో తమ్ముడు ఇంటర్ ఫైనల్ కొచ్చాడు. మా రెండోవాడు ఇంట్లో జీతం ఇస్తూవుంటే, నేను పంపిస్తూ వుంటే, ఇంకేం కావాలి? యూసీ, మై వర్క్ ఈజ్ ఆల్మోస్ట్ ఇన్ ఇట్స్ లాస్ట్ లాప్'' అన్నాడు.

మరికొన్ని నెలల తరువాత కలిశాడు. ఈసారెందుకో విచారంగా వున్నట్టనిపించాడు. ''ఏమిరా ఇలా వున్నావన్నాను.

''ఏమీలేద''న్నాడు. కానీ ఏదో దాస్తున్నాడని పించింది. కొన్ని నెలలదాకా మా పరిచయం వుత్తరాలకే పరిమితమై పోయింది. వుత్తరాల ద్వారా తెలుసుకున్న విషయమేంటంటే శర్మ 'ప్రేమ'లో పడ్డాడు. ఎవరో మరాఠీ అమ్మాయట. ఈసారి శర్మ 'ఆదివారం' వొస్తున్నానని వుత్తరం రాశాడు. అన్నట్టుగానే వొచ్చాడు.

ఇద్దరం బిర్లామందిర్ కెళ్లాం. శర్మ దిగులుగా వున్నాడు. ఎంత అడిగినా కారణం చెప్పలేదు. చీకటి పడింది. ఇద్దరం మౌనంగానే వున్నాం. పైనుండి క్రింద మనుషులు చీమల్లాగా వున్నారు. బస్సులు, కార్లు, స్కూటర్లు వేగంగా వెళ్తున్నాయి. ''వీళ్లంతా ఎటెళ్తున్నారో? అందరూ ఇంత బిజీ ఏమిటో?'' అనుకున్నాను.

''ఇక వెళ్దామా?'' అన్నాను.

''కృష్ణా, చిన్నప్పటి నుంచీ డబ్బులేక నేనేమి కోల్పోయానో అదంతా వొక ఎత్తు. ఇప్పుడు పోగొట్టుకున్నదొక ఎత్తు. ఈసారి నేను పోగొట్టు కున్న దేమిటో తెలుసా? నా జీవితం.''

''ఎవరా అమ్మాయి? నువ్వు పేరు రాయలేదు''

''ప్రవీణ కాడ్డే''

''నువ్వంటే ఇష్టపడలేదా?''

''ఇద్దరం వొకరికొకరం నచ్చాము''

''మరడ్డం ఏమిటి?''

''డబ్బు, ఆలస్యం డబ్బువల్ల. నేను పెళ్ళి చేసుకుంటే ఇంటికి పంపించే డబ్బు తగ్గు తుంది. మా అమ్మ రిటైరైపోయింది. ప్రయివేటు కంపెనీ కదా, నాన్నగారి వుద్యోగం ఇవ్వడమే ఆశ్చర్యకరమైన విషయం. ఏదో కొంత డబ్బిచ్చారు.

''తమ్ముడు రైల్వేలో చేరాడు కదా!''

''అవును. అయితే ట్రైనింగ్‌లో ఎవరో అమ్మాయి పరిచయమైంది. పెళ్లి చేసుకున్నాడు. వేరే వెళ్లిపోయాడు. ఎవ్వరం కాదు కూడదని అనలేదు. రెండేళ్లు ఆగమన్నాము. వినలేదు. ఇప్పుడసలు ఇంటి విషయాలు పట్టించుకోడు. ఇంటికి రాడు. డబ్బివ్వడు.''

''రెండో తమ్ముడేం చేస్తున్నాడు?''

''వాడిల్లొదిలి వెళ్లిపోయాడు. ఎటు వెళ్లాడో, ఎందుకు వెళ్లాడో తెలియదు. ఇంటి వాళ్లకు నా అవసరమెంతో, ఈ పరిస్థితులన్నీ ప్రవీణకు విడమర్చి చెప్పాను.''

''ఏమంది?''

''ఏమంటుంది? ఈ జీవితంలో కాదు కదా, వొచ్చే జన్మలో కూడా నేను సుఖపడ లేనంది. సుఖపడాలంటే ఇంట్లోంచి వేరే వొచ్చె య్యాలంది. 'నేను వేరే రాలేనన్నాను. కనీసం రెండు సంవత్సరాలాగమన్నాను. నన్నే ఆలో చించుకోమంది'' బాధగా చెప్పాడు.

''ఇదేం ప్రేమరా శర్మా? ఈ అమ్మాయి నిన్నుగానీ, నీ పరిస్థితినిగానీ అర్థం చేసుకున్నట్టు కన్పించదే?''

''నిజమే శరత్. అసలు నాకూ ప్రేమల మీద నమ్మకం లేదు. ఇది ఆకర్షణ కావచ్చు. కానీ ఈ ఆకర్షణ ఎంత బలంగా వుందంటే ప్రవీణ లేకపోతే ప్రపంచంలో ఏమీ లేదనిపి స్తోంది.''

''ఈ ప్రపంచం చాలా గమ్మత్తయినది కృష్ణా. నా ప్రస్థానం ఎప్పుడు తీరుతుందో? మనస్సు, మనస్సాక్షి వున్న వాడికి శాంతి అనేదే లేదేమో? అవి లేని వాడికే సుఖం. నాకేం చెయ్యాలో తోచటం లేదు. ఇన్ని రోజులింత సంపాదించాను. నా కోసం నేనస్సలు ఖర్చు పెట్టుకోలేదు. ఏదో నీ ముందు అప్పుడప్పుడూ తప్ప. ఏదైనా వొక రోజు ఎక్కువ ఖర్చుపెడితే ఆ ఖర్చుకు సరిపడ తిండి తినటం కొన్ని రోజులు మానేసేవాడిని. ఇప్పుడయినా కాస్త రిలాక్సవుదామనుకున్నాను. కానీ మళ్లా తిరిగి అంతా మొదలు పెట్టాలి. తమ్ముళ్లలాగా నా వాళ్లను వాళ్ళ దారికొదిలెయ్యలేను. నా ఆనందం వారి ఆనందంతో ముడిపడి వుంది. ఇది నా అదృష్టం అనుకుంటాను. ఏం చేస్తాం?''

నాకు చాలా బాధనిపించింది.

''రేపు నేను బాంబే వెళ్తున్నాను. హైదరా బాదు ట్రాన్స్‌ఫర్ చేస్తారు. రెండు మూడు నెలల్లో వొచ్చేస్తాను. ఈ మధ్యలో నువ్వు మా వాళ్లని కనిపెట్టి వుండు'' అన్నాడు.

మరుసటి రోజు వాడిని హాలిడే స్పెష లెక్కించాను. మనసంతా చికాగ్గా వుంది. బండి కదుల్తూంటే కంపార్ట్‌మెంట్ లోంచి తల బయటకు దూర్చి చెప్పాడు ''ఇంకో రెండు నెలల్లో వొచ్చేస్తాను. కాస్త మా యింటికెళ్తా వుండ''ని.

మరుసటి రోజు వార్తాపత్రికల్లో ఆ వార్త చదివి శర్మ ఇంటికి వెళ్లాను. బాంబే హాలీడే స్పెషల్, గూడ్సు బండి ఢీకొన్నాయట. ఇల్లు శోక సముద్రంలా వుంది. శర్మ తమ్ముడు న్నాడు. మొదట తీసిన శవం శర్మదేనట. నాకేం చేయాలో? ఎలా వోదార్చాలో? తెలియ లేదు. నెమ్మదిగా ఇంటి దారి పట్టాను. ఇంటికి పోబుద్ధికాలేదు. టాంక్‌బండ్ కెళ్లాను.

లోకంలో అన్నీ యథావిధిగా జరుగుతూనే వున్నాయి. బస్సులు కార్లు వేగంగా దూసుకొని పోతున్నాయి. ప్రజలంతా బిజీగా తిరుగు తున్నారు. ఆకాశం రోజూలాగే నల్లబడుతోంది. పక్షులు ఇళ్లకు తిరిగి వస్తున్నాయి. ఎవరికీ ఏం తెలియదా? ఎవ్వరికీ బాధగా లేదా? శర్మ చచ్చి పోయాడు. ఎన్ని కోరికలు? ఎంత ఆర్తి? ఎన్ని ఆలోచనలు? అన్నీ ఏవి? డబ్బు సంపాదిస్తా నన్నాడు. సంపాదించాడు. కానీ ఏం సాధిం చాడు? ఈ బ్రతుకుల కర్థం ఏమిటి? జీవి తాంతం కోరికలు పెంచుకోవడం, అవి తీర కుండానే పోవడం. ఇదేనా జీవితమంటే? శర్మ కుటుంబానికి దిక్కెవరు? తమ్ముళ్లు చూడరు. ఆ తల్లీ చెల్లెళ్ల సంగతేమిటి? ఆ కుటుంబం ఎలా గడుస్తుంది?

ఆ తరువాత రోజు వార్తాపత్రికల్లో చది వాను. ఆక్సిడెంట్‌లో చనిపోయిన వ్యక్తుల కుటుం బాలకు లక్ష రూపాయలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు.

పోనీ ... శర్మ తల్లీ చెల్లెలూ ఆ డబ్బుతో బ్రతుకుతారు. పాపం శర్మే బ్రతకలేకపోయాడు, దుర్మరణం పాలయ్యాడు. లేక, మరణించడం వల్ల బ్రతికి పోయాడా?

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి
భీమ సిమెంట్